మత్తు విముక్తికి వినూత్న పోరాటం

- ప్రజల్లో చైతన్యం తెస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రాచకొండ ప్రభాకర్
- ప్రాణ స్నేహితుడి మరణంతో చలించి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం



విచిత్ర వేషధారణలో ప్రభాకర్



సంతలో కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

సూర్యాపేట టౌన్ : ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఒక సామాజిక కార్యకర్తగా మారి సమాజంలో నెలకొన్న ఓ తీవ్ర సమస్యపై నిరంతరం పోరాడుతున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఆయనే మద్దిరాల మండలం గోరెంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాచకొండ ప్రభాకర్. జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో, నల్లని చొక్కా ధరించి, దానిపై పుర్రెబొమ్మ, నెత్తిన టోపీ, చేతిలో మైకు పట్టుకొని.. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ఆయన ప్రజలకు నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. గురువారం డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆయనపై ఒక ప్రత్యేక కథనం.

జనంలోకి.. చైతన్యం కోసమే!

వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన రాచకొండ ప్రభాకర్, పాఠశాల సమయం ముగిసిన తర్వాత కూడా విశ్రాంతి తీసుకోరు. ఉదయం, సాయంత్రం వేళల్లో, అలాగే సెలవు రోజుల్లో ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాలను ఎంచుకుంటారు. చేతిలో మైకు పట్టుకొని డ్రగ్స్, ధూమపానం, మద్యపానం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంచుతూ సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాలు, పట్టణాల్లో, ఇతర జిల్లాల్లో సైతం ఆయన తన ప్రచారాన్ని విస్తరించారు. కూలీలు పని చేసే ప్రాంతాలు, జాతరలు, వారాంతపు సంతలు.. ఇలా జనం గుమిగూడిన ప్రతిచోటా ఆయన ప్రచారం కొనసాగుతోంది. యువత మత్తు, డ్రగ్స్‌కు అలవాటు పడి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అటువంటి మత్తును దరిచేరనివ్వొద్దని ప్రచారం చేస్తూ ఆయన అందరి అభినందనలు పొందుతున్నారు.

ప్రాణ స్నేహితుడు చనిపోవడంతో..

ప్రభాకర్ ఈ సామాజిక పోరాటానికి దిగడానికి వెనుక ఒక హృదయవిదారక సంఘటన ఉంది. ఆయన ప్రాణ స్నేహితుడు ధూమపానానికి అలవాటుపడి, అనారోగ్యంతో అకాల మరణం చెందారు. తన స్నేహితుడి మరణంతో తీవ్రంగా చలించిపోయిన ప్రభాకర్, తన స్నేహితుడి వలె మరెవరూ ఇలా ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో డ్రగ్స్, ధూమపానం, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి విచిత్ర వేషధారణతో ప్రజలకు అవగాహన కల్పించడం మొదలుపెట్టారు. ఇప్పటివరకు అనేక ప్రాంతాల్లో ప్రజలకు చైతన్యం కల్పించి, అద్భుతమైన సేవలను అందిస్తున్నారు.

> **వందకు పైగా ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు**
>
> నా బాల్య మిత్రుడు ధూమపానం వల్ల అనారోగ్యానికి గురై చనిపోయాడు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. ఇవన్నీ చూశాక నాకు తీవ్రంగా బాధేసింది. నా వంతుగా కొందరినైనా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రచారం మొదలుపెట్టా. వందకు పైగా ప్రదేశాల్లో డ్రగ్స్, మత్తు పదార్థాలు, ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించా. నా వల్ల ఒక్కరు మారినా సంతోషమే.
>
> \- ప్రభాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మెరుగైన విద్యాబోధన అందించాలి

- కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



తరగతి గదిలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేటటౌన్ : విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా జెడ్పీహెచ్ఎస్‌లోని పదవ తరగతి గదిలో జరుగుతున్న గణితం క్లాస్‌ను, 9 వ తరగతి లో కొనసాగుతున్న బేస్‌లైన్ టెస్ట్‌లను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 రోజుల కార్యాచరణ ప్రతి పాఠశాలలో అమలు చేసి ఆగస్టు 15 నాటికి జిల్లాలో విద్యార్థులందరికీ తెలుగు చదవటం, రాయటం వచ్చేలా తీర్చిదిద్దాలన్నారు. బుక్ డిపో, కంప్యూటర్ ల్యాబ్ పరిశీలించారు. కంప్యూటర్‌లకు టేబుల్స్ లేవని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. వంట చేస్తున్న సిబ్బందిని ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడగగా వంట గది కావాలని తెలిపారు. వెంటనే ప్రతి పాదనలు పంపాలని సూచించారు. చర్చి కాంపౌండ్ లో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి స్టాక్, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పాలు, గుడ్ల నాణ్యతను పరిశీలించి ప్రతి రోజూ పిల్లలకు పోషకాహారం సమయం ప్రకారం అందించాలన్నారు. అలాగే తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలను సందర్శించి సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలతో పాటు రికార్డులను పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ కృష్ణయ్య, హెచ్ఎం గోలి పద్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ.. ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం



ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన నాయకులను సన్మానిస్తున్న రాణి రుద్రమ, తదితరులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : నాటి కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ అన్నారు. కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎమర్జెన్సీ సమయంలో బహిరంగంగా మాట్లాడిన ప్రతి వ్యక్తి మీద దాడి జరిగిందని, భావ ప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం బందీ చేయబడ్డాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లోనూ పోరాటం చేసిన నాయకుల ధైర్యమే నేడు మన ప్రజాస్వామ్యానికి ఆధారమని అన్నారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితం గడిపిన నేతలు డా. రంగాచార్యులు, కర్నాటి కిషన్, కుంట్ల రామకృష్ణారెడ్డి, దొంతగాని రాములు, తాలూరి రమేష్, యస ముక్తారెడ్డి, శ్రీపాద సోమయ్య, నాగవెల్లి దశరథ, తన్నీరు వాసుదేవ్‌లకు సన్మానం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన నాయకుల స్ఫూర్తితో మనం ముందుకు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, పార్లమెంట్ కో–కన్వీనర్ మన్మథరెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ బూర మాల్సూర్ గౌడ్, కో–కన్వీనర్ జల్లా జనార్దన్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చలమల నరసింహ, పోకల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కన్వీనర్లు కర్నాటి కిషన్, కనగల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : గత ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో విధించిన ఎమర్జెన్సీ రోజులను నేటి యువత తెలుసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కన్నెబోయిన రాముయాదవ్ అన్నారు. బుధవారం నాగారం మండల కేంద్రంలో యువతకు ఎమర్జెన్సీపై అవగాహన కల్పించారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ 1975లో ఎమర్జెన్సీ ప్రకటించి 21 నెలల పాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో మానవ హక్కులను, పత్రికా స్వేచ్ఛను కాలరాశారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాడు ఇందిరాగాంధీ ప్రకటిత ఎమర్జెన్సీ.. నేడు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీ

సూర్యాపేట అర్బన్ : ఆనాటి కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటిస్తే, నేడు మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నాడు కాంగ్రెస్ ఎమర్జెన్సీ విధించినప్పుడు ప్రజాస్వామిక హక్కులన్నింటినీ కాలరాసిందని, కార్మిక సంఘాల నాయకులందరినీ నిర్బంధించిందని ఆయన పేర్కొన్నారు. అలాగే నేడు అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని తెలిపారు.

మీలా సత్యనారాయణకు నివాళి



నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జున రెడ్డి

సూర్యాపేట అర్బన్ : ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ మున్సిపల్ చైర్మన్ మీలా సత్యనారాయణ సూర్యాపేట పట్టణ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. బుధవారం మీలా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుధాకర్ పీవీసీ కంపెనీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడారు. సుధాకర్ పీవీసీని సూర్యాపేటలో స్థాపించి వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించారని అన్నారు. పట్టణానికి రెండుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై అవినీతి రహిత పాలన అందించారని గుర్తు చేశారు. సీపీఎం నిర్వహించే అనేక ప్రజా పోరాటాలకు ఆయన తన వంతు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహాదేవ్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, కోట గోపి, సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రోత్సవాలు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణ పరిధిలోని పిల్లలమర్రి మహాదేవ నామేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయని శివాలయాల వంశపారంపర్య ప్రధాన అర్చకుడు మునగలేటి సంతోష్ శర్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. వారాహి దీక్ష స్వీకరించే భక్తులు దీక్ష వస్త్రాలు, పూజా సామగ్రితో దేవాలయానికి రావాలని కోరారు. జూలై 4న ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

సూర్యాపేట : పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి పెన్‌పహాడ్ మండల విద్యాధికారి రవికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్, సామగ్రి, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే అందించాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు నీలకంఠం సరస్వతి, శ్రావణి, సరిత, రాజ్యం, లక్ష్మి, ప్రమీల, గోవిందమ్మ, ఆదెమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

సూర్యాపేట : పట్టణంలో దోమల పెరుగుదలతో సంభవించే డెంగీ, మలేరియా వంటి వ్యాధులను నివారించేందుకు ప్రజలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం స్థానిక 22వ వార్డులో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్లలోని కూలర్లు, చెత్త తొట్టిలు, వాడిన టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇళ్ల పరి సరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ, దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ తిరుమలయ్య, జాన్‌పాటి నాగయ్య, ఏశబోయిన శ్రీను, టీఎంసీ శ్వేత, సయ్యద్ సమ్మి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శివ ప్రసాద్, యాదగిరి, వార్డు అధికారి వెంకట్ పాల్గొన్నారు.

హాస్పిటల్‌లో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు

సూర్యాపేట : సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి అనేక సమస్యలకు నిలయంగా మారిందని, వాటిని తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల మందులు లభించడం లేదని, చాలా మందులను బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, స్కానింగ్ రిపోర్టుల కోసం రోగులు రోజుల తరబడి ఆసుపత్రి చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపించారు. ఆస్పత్రిలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య, జిల్లా కమిటీ సభ్యుడు అంబటి భిక్షం, పార్టీ పట్టణ కార్యదర్శి గులాం హుస్సేన్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, కోశాధికారి మోటకట్ల జయమ్మ, పావని, లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎం

సూర్యాపేట : తలసేమియా బాధితుల కోసం ఎస్‌బీఐ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని ఎస్‌బీఐ సూర్యాపేట రీజినల్ మేనేజర్ బి.అనిల్ కుమార్ అన్నారు. జూలై 1న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో గల ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని ఆయన పేర్కొన్నారు. గత ఏడు దశాబ్దాలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిస్తూ, వారికి చేరువైందని తెలిపారు. ఈ శిబిరంలో 105 మంది ఉద్యోగులు రక్తదానం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ రీజినల్ సెక్రెటరీ విజయభాస్కర్, సేవా ఏజీఎస్ సురేందర్, టౌన్ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్. ఫణి కుమార్, హెచ్ఆర్ మేనేజర్ విఠల్ బాబు, కిషోర్, క్రాంతి, అనిల్, మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్, బదావత్ రామకృష్ణ, ఎస్‌బీఐ ఉద్యోగుల రీజినల్ సెక్రెటరీ అయితగోని మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు


తిరుమలగిరి : నాగారం మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో బుధవారం డ్రగ్స్ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఐలయ్య మాట్లాడారు. పాఠశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఉపయోగిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి. చంద్రబాబు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడొద్దు

సూర్యాపేట : యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ గోపికృష్ణ అన్నారు. బుధవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలోని బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై పెయింటింగ్, డ్రాయింగ్, స్లోగన్ పోటీలు నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థుల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య కార్యాలయానికి తాళం



మహిళా సమాఖ్య కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న మహిళా సంఘం సభ్యులు

సూర్యాపేట : సంఘ బంధం కమిటీని ఎంపిక చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ ఏపీఎం అజయ్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి బుధవారం మహిళా సంఘం సభ్యులు తాళం వేసి సెర్ప్ సిబ్బందిని నిర్బంధించి నిరసన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మాపురంలో సంఘబంధం–2 కార్యవర్గాన్ని నియమించకుండా ఏపీఎం అజయ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. దీనివల్ల తీసుకున్న రుణాలను చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. గ్రూప్ సభ్యులు డబ్బులు ఎవరికి కట్టాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఏపీఎం అజయ్‌ను వివరణ కోరగా, ఏప్రిల్ 16న మెజారిటీ సంఘం సభ్యుల తీర్మానంతో సంఘబంధం కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. మళ్లీ నూతన కమిటీ ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరం



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

సూర్యాపేట అర్బన్ : ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన సీపీఎం సూర్యాపేట నియోజకవర్గ స్థాయి శిక్షణ తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 'మతం – మతోన్మాదం' అనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యుడు దండ వెంకటరెడ్డి, వేల్పుల వెంకన్న, మేకనబోయిన శేఖర్, వీరబోయిన రవి, సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు గుంజ వెంకటేశ్వర్లు, వల్లపుదాసు సాయికుమార్, చిట్లంకి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం



విహారయాత్రకు వెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సూర్యాపేట : విహారయాత్రల వల్ల విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదం లభిస్తుందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మామిడి వెంకన్న అన్నారు. బుధవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గడ్డిపల్లి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించడానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ పరిశోధనలు, మొక్కలు, చేపల పెంపకం, కంపోస్టు ఎరువులు, సీడ్ తయారీ వంటి అంశాలను విద్యార్థులు పరిశీలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాణి, విజయకుమారి, వెంకన్న, విప్లవకుమార్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

అర్వపల్లి : క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.నగేష్ నాయక్ పిలుపునిచ్చారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో బుధవారం క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ నివారణ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, హెల్త్ అసిస్టెంట్లు సైదమ్మ, శకుంతల, ఆశా కార్యకర్తలు నాగమ్మ, సైదమ్మ, పద్మ, వసంత పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

అర్వపల్లి : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని శిక్షణ ఎస్ఐ తేజేశ్వరి అన్నారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం 'బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్' స్వచ్ఛంద సంస్థ సహకారంతో పేద, అనాథ విద్యార్థులకు బ్యాగులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఏఎస్ఐ మేకల రాములు, ఉపాధ్యాయినులు శ్రీదేవి, విమల, పుష్పవతి, అంజలి, బిగ్ హెల్ప్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి, పీడీ పి. మల్లేష్, డైరెక్టర్ కోటమర్తి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధర్మాపురం పాఠశాలలో ప్లేట్లు, గ్లాసులు..

సూర్యాపేట : ధర్మాపురం గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో భవాని మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భవాని మాత ఫౌండేషన్ చైర్మన్ గాయం సురేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు తాడూరి లింగయ్య, గుండు లింగయ్య, చేవుగాని అంజయ్య, చింతకాయల నరేష్, కరుణాకర్, గుండు నరేష్, భార్గవ చారి, సాలం అంజయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేవాదాయ భూముల వేలం రద్దు

నూతనకల్ : మిర్యాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాదాయ భూములకు నిర్వహించిన బహిరంగ వేలంను కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో దేవాదాయ అధికారులు, పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం నిర్వహించిన వేలం పాట కన్నా ఇప్పుడు వేలం తక్కువకు దక్కించుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. రద్దు చేసిన వేలం స్థానంలో తిరిగి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వేలం తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

అర్వపల్లి : ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన (పీఎంకేఎస్‌వై) ద్వారా వాటర్‌షెడ్ పథకం అమలవుతున్న గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ టి.గోపి తెలిపారు. లోయపల్లి గ్రామంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. అర్హులైన రైతులు 25 శాతం తమ వాటా ధనం చెల్లిస్తే, 75 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించడం జరుగుతుందని వివరించారు.

క్లుప్తంగా

అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల సాయిబాబా ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం అర్చకుడు విశ్వేశ్వర శర్మ ఆధ్వర్యంలో శివుడికి అన్నాభిషేకం, పుష్పాలంకరణ నిర్వహించారు. అనంతరం త్రిమూర్తులు కొలువైన చెట్లకు భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో గంగాధర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులతో నాయకత్వానికి బలం



శ్రమదానం చేస్తున్న కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట : ఆదివాసీ బునియాది కార్యకర్తల శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాలలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శ్రమదానం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్య, ఆరోగ్యం, భూమి హక్కులు, ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతులు ఆదివాసీ నాయ కత్వానికి బలాన్నిస్తాయని అన్నారు. అనంతరం హాస్టల్‌లో ఉన్న సమస్యల గురించి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ధిక్కరణకు పాల్పడిన నిందితుల అరెస్టు

నూతనకల్: కోర్టు ధిక్కరణకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచనపల్లి ఆవాసం గుగులోతు తండాకు చెందిన వాంకుడోతు లాలాజీ, వాంకుడోతు ప్రమీలపై 2021లో బాల్య వివాహాల నేరం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయగా, వారు బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడటంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

అర్వపల్లి : పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష అని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో బుధవారం సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, బడిబాట, వనమహోత్సవం, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ పథకాలపై కళాబృందంచే ఆటా–పాటా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీం సభ్యులు ఈర్ల సైదులు, లక్ష్మి, శ్రవణ్, మేడిపల్లి వేణు, ప్రియాంక, ప్రియదర్శిని, స్రవంతి, శిరీష, ఇంద్రజ, గ్రామస్తులు కూర శంకర్, బింగి కృష్ణమూర్తి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

అర్వపల్లి : పోస్టల్ శాఖ అందిస్తున్న వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు కోరారు. డాక్ కర్మయోగి డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ)లో భాగంగా బుధవారం అర్వపల్లి సబ్ పోస్టాఫీసులో వివిధ గ్రామాల పోస్టల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ, పోస్టల్ శాఖ ద్వారా బ్యాంకింగ్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోస్టల్ శాఖ పథకాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పోస్టల్ అధికారులు సుధీర్, అప్పయ్య, స్థానిక ఎస్పీఎం దయాకర్, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడు సత్యనారాయణ మృతి



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ ఆర్ఎంపీ వైద్యుడు తన్నీరు సత్యనారాయణ(60) బుధవారం మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సత్యనారాయణకు వైద్యులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు నివాళులర్పించారు.